

బాలికల ఓవరాల్ చాంపియన్ వరంగల్

రాష్ట్ర స్థాయి అండర్-14 జూడో పోటీల్లో బాలికల విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా వరంగల్ నిలిచింది.

- 8లో ▸



క్షేత్రస్థాయి నుంచి ఉద్యమం ఉధృతం

క్షేత్ర స్థాయి నుంచి బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాను సురేశ్ అన్నారు.


- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $32^0/25^0$

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

నయా సాల్.. నయా కోర్సు





వరంగల్ నిట్‌లో అందుబాటులోకి ..

- జీటెక్, ఎంటెక్‌లతోపాటు ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ
- ఆయా విభాగాల్లో ప్రతీ ఏడాది కొత్త కోర్సులు
- క్యాంపస్ సెలక్షన్స్‌లో తోడ్పాటు

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్ అంటేనే ప్రత్యేక విద్యా బోధన, క్యాంపస్ సెలక్షన్స్‌కు ఒక బ్రాండ్‌గా నిలుస్తున్న విషయం తెలిసిందే. ఇంజనీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్ రంగాల్లో ఇప్పటికే అత్యుత్తమ బోధన అందిస్తున్న ఈ విద్యాసంస్థలో ఈ ఏడాది కొత్త కోర్సులను ప్రవేశ పెట్టారు. బీటెక్‌లో ఇప్పటికే పది కోర్సులు ఉండగా, ఏఐ అండ్ డీఎస్ పేరిట మరో కోర్సును



అందుబాటులోకి తెచ్చారు. ఎంటెక్‌లో 8 కోర్సులు కొనసాగుతుండగా కంట్రోల్ అండ్ ఆటోమేషన్ పేరిట నయా సాల్ నయా కోర్సు అంటూ 2024-25 విద్యా సంవత్సరంలో ప్రారంభమయ్యాయి. దీంతో విద్యార్థులు ఆధునిక టెక్నాలజీ చేరువతో నూతన ఆవిష్కరణలకు సంసిద్ధులవుతున్నారు.

బీటెక్.. ఎంటెక్‌లో కోర్సులు ఇలా..

- బీటెక్‌లో సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కెమికల్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్, కంప్యూటర్ సైన్స్, బయోటెక్నాలజీ కోర్సులు కొనసాగుతున్నాయి. గతేడాది నూతనంగా బీటెక్‌లో మ్యాథ్స్ అండ్ కంప్యూటింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో వీఎల్ఎస్ఐ (వెరీ లార్జ్ స్కేల్ ఇంటిగ్రేషన్) పేరిట కోర్సులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది నూతనంగా ఏఐ అండ్ డీఎస్ పేరిట కోర్సు ప్రారంభించారు.
- ఎంటెక్‌లో సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కెమికల్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్, బయోటెక్నాలజీ విభాగాలు కొనసాగుతుండగా ఈ ఏడాది నూతనంగా ఎలక్ట్రికల్ విభాగంలో కంట్రోల్ అండ్ ఆటోమేషన్ కోర్సును ప్రారంభించారు.
- వీటితోపాటు బీఎస్సీ, బీఈడీ,బీఎల్ఐఎస్సీ, ఎంసీఏ, ఎంబీఏ, ఎమ్మెస్సీ కోర్సులు కొనసాగుతున్నాయి.

రాబోయే ఏడాది..

వచ్చే విద్యా సంవత్సరంలో బీటెక్‌లో ఏరోనాటికల్ ఇంజనీరింగ్, రైల్వే ఇంజనీరింగ్, అగ్రి టెక్ ఇంజనీరింగ్ కోర్సులను ప్రారంభించేందుకు ప్రతిపాదనలను కేంద్ర విద్యాశాఖకు పంపించారు. అనుమతులు రాగానే ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

అత్యుత్తమ బోధనతో ఉపాధి

నిట్ వరంగల్‌లో అందజేస్తున్న బీటెక్, ఎంటెక్ ఇంజనీరింగ్ కోర్సులతోపాటు సైన్స్, మేనేజ్‌మెంట్ విభాగాల్లో అత్యుత్తమ బోధనతో ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తున్నాయి. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నూతన కోర్సులకు శ్రీకారం చుడుతున్నాం. అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించేందుకు నూతన కోర్సులు తోడ్పడుతాయి.



- బిద్యాధర్ సుబుధీ, నిట్ డైరెక్టర్



క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు పొందిన వారు | 2022-23లో **1,430** మంది | 2023-24లో **1,140** మంది

అత్యధికంగా రూ.88 లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికవడం నిట్ విశిష్టతను తెలుపుతుంది.

న్యూస్‌రీల్

కాంట్రాక్టు టీచర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కేయూ క్యాంపస్: ఉమ్మడి ఏపీలో 2008 డీఎస్సీలో ఎంపిక కాని బీఈడీ అభ్యర్థులు కాంట్రాక్ట్ పద్ధతిలో సేవలందించేందుకు దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ డీఈఓ డి.వాసంతి గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2008 డీఎస్సీలో డీఈడీ కోటాలో మిగిలిన పోస్టుల భర్తీ నిమిత్తం ఉమ్మడి వరంగల్ జిల్లాలో 274మంది బీఈడీ అభ్యర్థులను గుర్తించినట్లు తెలిపారు. ఆ మెరిట్‌లిస్ట్‌ను www. schooledu. telangana. govt. in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కాంట్రాక్టు పద్ధతిలో సేవలందించేందుకు సంసిద్ధులైన బీఈడీ అభ్యర్థులు ఈ నెల 27నుంచి అక్టోబర్ 5వరకు హనుమకొండ డీఈఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, వెంటనే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని సూచించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ములుగు రూరల్: మండల పరిధిలోని జాకారం సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. గురుకుల పాఠశాల విద్యార్థులు దుర్గం రమణ, దుర్గం సాత్విక్‌లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షించదగిన విషయమన్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి జమ్మూకాశ్మీర్‌లో జరిగే పోటీలకు వారు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పిచ్చిరెడ్డి, సదయ్య, పీడీ వెంకట్‌రెడ్డి, పీఈటీ భాస్కర్, రామచంద్రం, దయానంద్, యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాడి మహేందర్‌కు 14 రోజుల రిమాండ్



వాజేడు: చిరుత పులి చర్మంతో పట్టుబడిన జాడి మహేందర్‌కు ములుగు స్పెషల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ (మొబైల్) కోర్ట్ 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో అతన్ని గురువారం పరకాల సబ్ జైలుకు తరలించారు. వివరాల్లోకి వెళ్తే..వాజేడు మండల పరిధిలోని చంద్రుపట్ల క్రాస్ వద్ద 163 జాతీయ రహదారిపై పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఊట్లూరు గ్రామానికి చెందిన మహేందర్ చిరుతపులి చర్మంతో పట్టుబడిన విషయం విదితమే. కాగా అతనిపై 1972 వన్యమృగ సంరక్షణ చట్టం ప్రకారం కేసు నమోదు చేసిన వాజేడు రేంజర్ చంద్రమౌళి తన సిబ్బందితో కలిసి గురువారం జిల్లా కోర్టులో హాజరు పర్చారు. కేసు పూర్వాపరాలు విన్న జిల్లా కోర్టు జడ్జి 14 రోజులు రిమాండ్ విధించగా మహేందర్‌ను సబ్ జైలుకు తరలించినట్లు రేంజర్ తెలిపారు.

శ్రీనివాస్‌రెడ్డికి బంగారు పతకం

భూపాలపల్లి అర్బన్: ఒడిశా రాష్ట్రంలో జరిగిన పవర్ లిఫ్టింగ్ కోల్ ఇండియా స్థాయి పోటీల్లో భూపాలపల్లి ఏరియాకు చెందిన ఎస్.శ్రీనివాస్‌రెడ్డి బంగారు పతకం సాధించినట్లు ఏరియా అధికార ప్రతినిధి మారుతి ప్రకటనలో తెలిపారు. ఏరియాలోని కేటీకే 6వ గనికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి కోలిండియా పోటీల్లో 595 కిలోల బరువు ఎత్తి గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా సింగరేణి జీఎం పర్సనల్ వెల్ఫేర్ సామిల్ సుధాకర్ అభినందించినట్లు తెలిపారు.

ఏజెన్సీపై నిఘా



సీసీ కమాండ్ కంట్రోల్‌రూంను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

జిల్లా వ్యాప్తంగా 370 సీసీ కెమెరాల ఏర్పాటు

- ప్రతీ రెండు కిలోమీటర్లకు ఒకటి
- గోదావరి పరీవాహక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

ములుగు: జిల్లాలో రోజురోజుకు రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల నుంచి చొరబడుతున్న మావోయిస్టుల రాక.. బలవుతున్న అమాయక గిరిజన ఆదివాసీ బిడ్డల మృత్యువాతలు ఆందోళనకరంగా మారాయి. వీటన్నింటికి ఫుల్‌స్టాప్ పెట్టడానికి జిల్లా పోలీసు యంత్రాంగం ఒక అడుగు ముందుకేసింది. అడుగడుగునా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసింది.

గోదావరి పరీవాహకంపై..

జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతాలైన ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, వాజేడు, వెంకటాపురం(కె) మండలాల పరిధిలోని అసాంఘీక కార్యక్రమాలను ఎప్పటికప్పుడు చూడడానికి పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా వర్షాలు తగ్గుముఖం పట్టే సమయంలో ఇతర ప్రాంతాల నుంచి గోదావరి ఫెర్రీ పాయింట్ల మీదుగా జిల్లాలోకి ప్రవేశించే వారిని అరికట్టే అవకాశం ఉంటుంది. గతంలో వాంటెడ్ పోస్టర్లపై అతికించిన మావోయిస్టులు వచ్చిన సందర్భంలో సీసీ ఫుటేజీలు వారి కదలికలను గుర్తించడానికి వీలుగా మారుతుందని పోలీసు శాఖ భావిస్తుంది. దీంతో పాటు రాత్రి సమయాల్లో జరిగే గుట్కా, గుడుంబా, బెల్లం, పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

కమాండ్ కంట్రోల్ రూం

జిల్లాలో 163వ జాతీయ రహదారితో పాటు పక్కనే ఉన్న మండలాల్లోని సీసీ ఫుటేజీలను పరిశీలించడానికి జిల్లాకేంద్రంలో కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. వీటిని బుధవారం మంత్రి సీతక్క ప్రారంభించారు. ఎస్పీ శబరీశ్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ క్రమంలో జిల్లా పోలీసు శాఖ పనితీరును మంత్రి అభినందించారు. ఏ ఒక్క నిందితుడు తప్పించుకోకుండా సీసీ కెమెరాలను పూర్తి స్థాయిలో వినియోగించాలని సూచించారు.



జిల్లా నలుమూలలా సీసీ కెమెరాలు

జిల్లా సరిహద్దు అయిన ములుగు మండలం మహ్మద్‌గౌస్‌పల్లి నుంచి మంగపేట మండలం బ్రాహ్మణపల్లి చెక్‌పోస్టు వరకు ఇటు జయశంకర్ భూపాలపల్లి జిల్లా, భద్రాద్రికొత్తగూడెం జిల్లా , ఛత్తీస్‌ఘడ్ వైపుకు ఇలా నలుమూలలా పోలీసు శాఖ 370 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. ప్రతీరెండు కిలోమీటర్లకు ఒక్కో కెమెరాను బిగించడంతో పాటు ప్రధాన కూడళ్లలో విద్యుత్ ఆధారిత కెమెరాలు, విద్యుత్ సమస్య ఉన్న ప్రాంతాల్లో సోలార్ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇక దొంగతనాలు, ఓవర్‌స్పీడ్, వాహనాల కదలికలను గుర్తించడంతో పాటు రహదారులపై జరిగే రోడ్డు ప్రమాదాలను కనిపెట్టి నిందితులు తప్పించుకోకుండా ఆధారాలతో పట్టుకోవాలనే లక్ష్యంతో ఎస్పీ శబరీశ్ సీసీ కెమెరాల ఏర్పాటు కసరత్తు పూర్తి చేశారు.

రెండు కిలోమీటర్లకు ఒక సీసీ కెమెరా..

ములుగు జిల్లా ప్రారంభం నుంచి సరిహద్దులు ముగిసేంత వరకు ప్రతీ రెండు కిలోమీటర్లకు ఒక సీసీ కెమెరాను ఏర్పాటు చేశాం. జిల్లా వ్యాప్తంగా 370 అమర్చాం. రోడ్డు ప్రమాదాల నివారణ, బెల్లం, గుట్కా, పశువుల అక్రమ తరలింపు విషయంలో సీసీ కెమెరాలు సహాయంగా ఉంటాయి. సీసీటీవీ కమాండ్ కంట్రోల్ రూంను సైతం ఏర్పాటు చేశాం. పర్యవేక్షణకు ప్రత్యేక అధికారితో కూడిన సిబ్బందిని ఏర్పాటు చేశాం. ఇక ముందు గ్రామాల్లో సైతం సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తాం. వాహనదారులు రోడ్డు ప్రమాణాలు పాటించాలి.



- డాక్టర్ శబరీశ్, ఎస్పీ

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా
- ఉపాధ్యాయ సంఘాలతో పీఓ సమావేశం



ఉపాధ్యాయ సంఘాలతో చర్చిస్తున్న పీఓ

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని ట్రైబల్ వెల్ఫేర్ టీచర్ల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయ సంఘాలు, హెడ్మాస్టర్లతో పీఓ గురువారం సమావేశం అయ్యారు. బదిలీలు, కౌన్సెలింగ్‌పై చర్చించారు. ప్రమోషన్లు 70/30 నిష్పత్తికి సంబంధించి సీటీడబ్ల్యూని రాతపూర్వకంగా వివరణ కోరుతామన్నారు. ప్రస్తుతం ఉన్న ఖాళీలకు వ్యతిరేకంగా సర్దుబాటు కోసం ఆప్రిల్‌లో ఉన్న 9 కేసులకు సంబంధించి రేపు డీడీ ఆఫీస్ కార్యాలయాన్ని సందర్శించనున్నట్లు తెలిపారు. ఏటీడీఓ, కాంప్లెక్స్ రీసోర్స్ నోడల్ అధికారుల సమన్వయంతో ఏక ఉపాధ్యాయ పాఠశాలలకు ప్రత్యామ్నాయాల ఉపాధ్యాయులను నియమించేందుకు జాబితా సిద్ధం చేస్తామన్నారు. రెగ్యులర్ డీడీ ఎక్కువ కాలం మెడికల్ లీవ్ ఉండడం మూలంగా డిప్యూటీ డైరెక్టర్‌గా ప్రేమకళను ములుగు, భూపాలపల్లి జిల్లాలకు ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఈ సమావేశంలో డీటీడీఓలు ప్రేమకళ, సౌజన్య, ఏటీడీఓలు క్షేత్రయ్య, దేశీరాం, జీసీడీఓ సుగుణ, అకాడమిక్ మానిటరింగ్ అధికారులు రవీందర్, శ్రీరాములు, ఉపాధ్యాయ సంఘం నాయకులు సమ్మారావు, పాడెం కృష్ణప్రసాద్, సంతోష్, రాజు, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం పీఓను ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ చీఫ్ శంకర్ కలిశారు. ఈ మేరకు ఐటీడీఏ పరిధిలో సాంకేతిక సమస్యలతో పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలపై చర్చించారు. ప్రతిపాదనల ప్రకారం రూపొందించిన పనులను సకాలంలో పూర్తి అయ్యేవిధంగా చూడాలని పీఓ కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య



పస్రాలో ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న అప్పయ్య

గోవిందరావుపేట: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య అన్నారు. మండల పరిధిలోని పస్రాలో పీహెచ్‌సీ వైద్యురాలు సుహాన ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. శిబిరంలో 52మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఐదుగురు జ్వరంతో బాధపడుతున్నట్లు తెలిపారు. జ్వర పీడితులకు ఆర్డీటీ మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశామన్నారు. అభ్యుదయ కాలనీలో పరిసరాలను పరిశీలించారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వల కారణంగా దోమలు వృద్ధి చెంది అనారోగ్యం భారిన పడుతారని తెలిపారు. దోమలతో వ్యాప్తి చెందే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, ఏఎన్ఎం సంపూర్ణ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సీడీపీఓ ప్రేమలత



మాట్లాడుతున్న సీడీపీఓ ప్రేమలత

ఏటూరునాగారం: పౌష్టికాహారం తీసుకుంటేనే మహిళలు సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉంటారని ఏటూరునాగారం ఐసీడీఎస్ సీడీపీఓ ప్రేమలత అన్నారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోషణ అభియాన్ కార్యక్రమం ద్వారా మహిళల ఆరోగ్య రక్షణకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గర్భిణులు బలమైన ఆహారం తీసుకున్నప్పుడే వారు ఆరోగ్యకరమైన శిశువులకు జన్మనిస్తారని తెలిపారు.అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రేణుక మాట్లాడుతూ మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ ఫాతిమా, నవీన్, వెంకటయ్య, జ్యోతి, జీవవేణి, సుమలత, భావన పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

కన్నాయిగూడెం: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ ప్రేమలత అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యులు గిరి ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తక్కువ బరువు ఉన్న పిల్లలకు, బాలింతలకు హెల్త్ చెకప్ చేశారు. అనంతరం ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పౌష్టికాహార లోపంతో ఉన్న పిల్లలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాలింతలు, పిల్లలు, గర్భిణులు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల పోషకాహార లోపాన్ని అరికట్టవచ్చన్నారు. పౌష్టికాహారం తీసుకోకుంటే పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రమణ, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు పుష్పలత, శ్రీవిద్య, ఏఎన్ఎం కవిత, ఆశ వర్కర్‌లు, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

కలెక్టర్ టీఎస్.దివాకర



ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ దివాకర, అధికారులు



విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు: భూమికోసం, భుక్తి కోసం, బానిస సంకెళ్ల విముక్తి కోసం పోరాటం చేసిన చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన చాకలి ఐలమ్మ 129వ జయంతి ఉత్సవాలకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అధికారులతో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణలో తొలి భూ పోరాటానికి నాంది పలికిన ధైర్యశాలి ఐలమ్మ అన్నారు. నిజాం నిరంకుశ పాలనలో దొరల దాష్టికానికి ఎదురుతిరిగి తెలంగాణ సాయుధ పోరాటంలో వీరోచితంగా పోరాటం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రవీందర్‌రెడ్డి, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పోటీలు ఆహ్లాదకరంగా ఉండాలి

డైరెక్టర్ ఆఫ్ యూత్ సర్వీస్ ఆదేశాల మేరకు జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో రేపటి(శనివారం) నుంచి నిర్వహించనున్న జిల్లా స్థాయి యువజనోత్సవాలు, క్రీడా పోటీలు ఆహ్లాదకరంగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దివాకర అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. పోటీల్లో పాల్గొనేవారు ఉదయం 9నుంచి 11గంటల వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో అక్టోబర్ 1న నిర్వహించనున్న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వారోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరించారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

ములుగు రూరల్: విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని ప్రణాళికతో ముందుకు సాగాలని కలెక్టర్ దివాకర అన్నారు. ఈ మేరకు గురువారం స్వచ్ఛత హీ సేవ పక్షోత్సవాలలో భాగంగా మండల పరిధిలోని మల్లంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన సందర్శించారు. స్వచ్ఛత హీ సేవ ప్రతిజ్ఞను విద్యార్థులతో కలిసి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన ఇన్‌డోర్ గేమ్స్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మల్లంపల్లి పశువుల సంత, మార్కెట్ స్థలం సందర్శించారు. సంత స్థలంలో మొరం పోసి చుట్టూ హద్దులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వన్యప్రాణులను వేటాడడం నేరం



వేటగాళ్లను పట్టుకున్న అటవీశాఖ అధికారులు

ములుగు రూరల్: వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమని అటవీశాఖ డివిజనల్ అధికారి డోలి శంకర్ అన్నారు. మండల పరిధిలోని దేవగిరిపట్నంలో అడవి పందులకు విద్యుత్ తీగలు అమర్చి వేటాడిన వేటగాళ్లను గురువారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవగిరిపట్నంకు చెందిన కేలోత్ బాలు, భూక్య సురేష్‌లు పత్తి చేను చుట్టూ విద్యుత్ తీగలు అమర్చడంతో రెండు అడవి పందులు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయని తెలిపారు. వాటిని గ్రామ శివారులో కాలుస్తుండగా వెళ్లి పట్టుకున్నామన్నారు. వేటకు ఉపయోగించిన విద్యుత్ వైర్లు, బైండింగ్ వైరు, కత్తిని స్వాధీనం చేసుకొని వేటగాళ్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ జాన్, బీట్ ఆఫీసర్ శివకృష్ణ, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలో ఎస్సీ బాలుర హాస్టల్ ఏర్పాటుతో పాటు విద్యార్థులు ఎదుర్కొంటున్న తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేడు(శుక్రవారం) ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన హాలో విద్యార్థి.. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు దిగొండ భరత్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద చేపట్టనున్న ధర్నాకు విద్యార్థులు తరలిరావాలని కోరారు.

ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న జ్యోతి

గోవిందరావుపేట: ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని వైఆర్‌జీ కేర్ లింక్ స్కీం సంస్థ సీపీఎం జ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఎయిడ్స్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ నాలుగు విధాలుగా మానవులకు సోకుతుందన్నారు. గర్భిణులు తప్పని సరిగా హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో హెచ్ఐవీ పరీక్షలు ఉచితంగా చేసి రిపోర్టులను గోప్యంగా ఉంచుతారని వివరించారు. గర్భిణులకు హెచ్ఐవీ సోకితే పుట్టబోయే బిడ్డకు రాకుండా మందులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీత, ఐసీటీసీ కౌన్సిలర్ కుమార్‌సింగ్, లింక్ వర్కర్ కిషన్ పాల్గొన్నారు.

నేడు 'నిధి ఆప్కే నికాత్ -2.0'

హన్మకొండ అర్బన్ : ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లకు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) ద్వారా అందించే సేవలు, వారి సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆయా జిల్లాల కేంద్రాల్లో 'నిధి ఆప్కే నికాత్ -2.0' నిర్వహించనున్నట్లు వరంగల్ ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ -2 ధానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌లోని ప్రతిమ కేన్సర్ హాస్పిటల్, హనుమకొండలోని తిరుమల హేచరీస్ (ప్రై) లిమిటెడ్, రాంనగర్, మహబూబాబాద్‌లోని డోర్నకల్ మున్సిపాలిటీ, జనగామలోని సెయింట్ మేరీస్ హైస్కూల్, ఘన్‌పూర్, భూపాలపల్లిలోని ఎస్ఆర్ డీజీ స్కూల్, ములుగులోని ఆర్అండ్ బీ భవనంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. సభ్యులు హాజరై తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

నేడు ఇంటర్వ్యూ

కాశిబుగ్గ: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆయుష్ ఆరోగ్య కేంద్రాల్లో యోగా ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులకు శుక్రవారం వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఆయుష్ ఆర్‌డీడీ బి. ప్రమీలాదేవి, జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ మైదం రాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఇంటర్వ్యూ వరంగల్ బస్టాండ్ సమీపంలోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాలలో ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. యోగా సర్టిఫికెట్‌లు కలిగి లోకల్‌గా ఉన్న వారికి ఈ ఇంటర్వ్యూలో ప్రాధాన్యం ఉంటుందన్నారు.

'టెమ్రిస్'కు సొంత భవనాలు కలేనా?

మైనారిటీ గురుకులాలకు రూ.లక్షల్లో అద్దె చెల్లింపులు

- దేశాయిపేట మోడల్ గురుకులానికి మోక్షమెప్పుడో..
- మంత్రి సురేఖ చొరవ చూపాలంటున్న మైనారిటీ సంఘాలు

న్యూశాయంపేట : నిరుపేద మైనారిటీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యనందించేందుకు 2016–17 విద్యాసంవత్సరంలో గత ప్రభుత్వం తెలంగాణ మైనారిటీ గురుకులాల విద్యాసంస్థల (టెమ్రిస్) ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో గురుకులాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అప్పటికే వరంగల్ జక్కలొద్దిలో ఉన్న బాలుర గురుకులానికి తోడు మరో నాలుగు(రెండు బాలికలు, రెండు బాలుర) గురుకులాల ఏర్పాటు చేసింది. వీటికి ఆదరణ పెరగడంతో ఎమ్మెల్యేల ఒత్తిడితో ప్రతి నియోజకవర్గానికి ఒక్కటి చొప్పున 2017–18 విద్యాసంవత్సరంలో మరో 11 (ఐదు బాలుర, ఆరు బాలికల) గురుకులాలు ఏర్పాటు చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 16 గురుకులాల్లో 2019–20 విద్యాసంవత్సరం నుంచి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సులతో ఇంటర్ విద్యను ప్రారంభించారు. ఇంత వరకు బాగానే ఉన్నా నేటికీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒక్క వరంగల్ జక్కలొద్దిగురుకులం మినహా, మరో 15 గురుకులాలకు సొంత భవనాలు లేక అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. సొంత భవనాలు లేకపోవడంతో విద్యార్థులు అసౌకర్యాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంజూరైన గురుకులాలకు ఒక్కో భవనానికి రూ. లక్షల్లో అద్దె చెల్లిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలకు రూ. కోటికి పైనే అద్దెరూపంలో వెచ్చిస్తున్నారు. యజమానులు సరైన సదుపాయాలు కల్పించడంలో విఫలం చెందుతున్నారు. 2020 వరకు ప్రతి నెలా అద్దె చెల్లిస్తున్నా.. ఆ తరువాత కరోనా మహమ్మారితో ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో అద్దె చెల్లింపుల్లో నెలల తరబడి ఆలస్యం కావడంతో యజమానులు భవనాలు ఖాళీ చేయమని అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో ఏటా కొత్త భవనాలను వెతుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది.

నిధులున్నా నిర్మాణం సాగడం లేదు..

దేశాయిపేట మోడల్ గురుకుల నిర్మాణానికి 'కుడా' నిధులు రూ. 4 కోట్లతో పాటు మైనారిటీ సంక్షేమ శాఖ మంజూరు చేసిన రూ. 4 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నా నిర్మాణ పనులు చేయించడంలో అధికారులు విఫలం చెందుతున్నారు. ఇప్పటి వరకు వరంగల్ దేశాయిపేట బాలికల మోడల్ గురుకుల నిర్మాణ పనులు పిల్లర్లు, స్లాబ్ దశలోనే జరిగాయి. అధికారుల అలసత్వంతో పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉన్న చందంగా తయారయ్యాయని మైనారిటీ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికైనా గురుకులాల సొంత భవనాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు త్వరగా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మైనారిటీ సంఘాలు కోరుతున్నాయి.

15 గురుకులాలు అద్దె భవనాల్లోనే..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 15 మైనారిటీ గురుకులాలు ఇప్పటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు అధికారులు భవనాల నిర్మాణాల కోసం స్థలాల అన్వేషణ కూడా జరపలేదని తెలుస్తోంది. ఒకటి, రెండు చోట్ల స్థలాలు గుర్తించినా ఉన్నత స్థాయి అధికారుల వద్దకు ఫైళ్లు మూవ్ కాలేదని అధికారులు చెబుతున్నారు. వరంగల్ జిల్లాల్లో.. వరంగల్(జీ1- కేయూ వద్ద ఓ ప్రైవేట్ కళాశాల బిల్డింగ్), వరంగల్(జీ2- శంభునిపేట దూపకుంటరోడ్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాల భవనం), నర్సంపేట(జీ1 – మార్కెట్ వద్ద ఓ ప్రైవేట్ ఐటీఐ భవనం), వర్ధన్నపేట(బీ1- వర్ధన్నపేట బస్టాండ్ వద్ద ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాల భవనం), హనుమకొండ జిల్లాలో.. హనుమకొండ(బీ1- పెద్దమ్మగడ్డ వద్ద ఉన్న ఓ ప్రైవేట్ ఐటీఐ భవనం), హనుమకొండ(జీ1-హంటర్‌రోడ్‌లో ఉన్న అపార్ట్‌మెంట్), పరకాల(బీ1-ఒగ్లాపూర్ వద్ద ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల భవనం), కాజీపేట(బీ1- కాజీపేట కడిపికొండ వద్ద ఓ ప్రైవేట్ కళాశాల భవనం), జనగామ జిల్లాలో.. జనగామ(బీ1-ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల), స్టేషన్‌ఘన్‌పూర్(జీ1- ఘన్‌పూర్‌లో ఓ ఇంజనీరింగ్ కళాశాల), మహబూబాబాద్ జిల్లాలో.. తొర్రూరు(జీ1- పట్టణంలోని ప్రైవేట్ పాఠశాల భవనం), మహబూబాబాద్ (బీ1- ప్రైవేట్ భవనం), డోర్నకల్(జీ1- ప్రైవేట్ పాఠశాల భవనం), భూపాలపల్లి జిల్లాలో.. భూపాలపల్లి(బీ1-పట్టణంలోని ప్రైవేట్ పాఠశాల భవనం), ములుగు జిల్లాలో.. ములుగు(జీ1- ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్ భవనం)లో గురుకులాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి.

షాదీఖానా వద్దు.. గురుకులం ముద్దు..

వరంగల్ జిల్లా పరిధి వరంగల్ తూర్పు నియోజకవర్గం దేశాయిపేటలో బాలికల మోడల్ మైనారిటీ గురుకులం ఏర్పాటుకు అప్పటి ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ చొరవ చూపి ప్రయత్నాలు ప్రారంభించారు. అప్పటికే దేశాయిపేటలో రూ. ఐదుకోట్ల వ్యయంతో ఉర్దూఘర్-షాదీఖానా నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. నిధుల లేమితో ఆ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. తూర్పు నియోజకవర్గానికి చెందిన మైనారిటీ సంఘాలు అక్కడ షాదీఖానా వద్దని, దానిని బాలికల మోడల్ మైనారిటీ గురుకులంగా మార్చు చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. దీంతో షాదీఖానా నిర్మాణాన్ని ఎల్‌బీ నగర్‌కు మార్చి కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్(కుడా) నిధులతో పాటు మైనారిటీ సంక్షేమశాఖ నుంచి సుమారు రూ. 8 కోట్లు మంజూరు చేయించి గత ఎన్నికల ముందు మోడల్ గురుకులంతో పాటు ఎల్‌బీ నగర్ షాదీఖానా పనులకు శంకుస్థాపనలు చేశారు.



వరంగల్ దేశాయిపేటలో నిర్మాణంలో ఉన్న మైనారిటీ మోడల్ గురుకులం

మంత్రి సురేఖ చొరవ చూపాలి



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మైనారిటీ గురుకులాల పక్కా భవనాల నిర్మాణానికి మంత్రి కొండా సురేఖ చొరవ చూపాలి. అధికారులతో చర్చించి స్థలాల గుర్తింపు చేపట్టాలి. ఉమ్మడి వరంగల్ జిల్లాను ఎంఎస్‌డీపీ పథకం కింద చేర్చించి భవనాల నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలి. మైనారిటీ సంక్షేమశాఖ వద్ద ఉన్న నిధులను భవనాల నిర్మాణానికి వెచ్చించాలి.

– మహ్మద్ అబ్దుల్ ఖుద్దూస్, బీఆర్ఎస్ నాయకుడు

29న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 29వ తేదీన జూనియర్స్ విభాగంలో బాలబాలికలకు ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి బి. వీరన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వచ్చే నెల(అక్టోబర్) 4నుంచి 6వ తేదీ వరకు కామారెడ్డిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డును వెంట తీసుకుని 29వ తేదీ ఉదయం జేఎన్‌ఎస్‌లోని బ్యాడ్మింటన్ మైదానం వద్ద రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. వివరాలకు 98492 01467 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

కొనసాగుతున్న రైల్వే మెగా బ్లాక్

- ఈ నెల 22 నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు..

కాజీపేట రూరల్: కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలో గల హసన్‌పర్తి, వరంగల్ వైపున గల మూడో రైల్వేలైన్‌కు సంబంధించిన పనులను రైల్వే మెగా బ్లాక్ చేపట్టి చేస్తున్నారు. టౌన్ స్టేషన్ సమీపంలో గల ఎఫ్-క్యాబిన్, ఈ-క్యాబిన్ వద్ద మూడో రైల్వే లైన్ నిర్మాణానికి సంబంధించి హసన్‌పర్తి-వరంగల్, హసన్‌పర్తి-కాజీపేట కొత్త రైల్వే లైన్ నిర్మాణం, బైపాస్ లైన్ నిర్మాణ పనులు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రైల్వే బ్లాక్‌లో కాజీపేటలో అన్ని రైల్వే విభాగాల నుంచి సుమారు 500 మంది రైల్వే కార్మికులు, కాజీపేట, సికింద్రాబాద్ నుంచి సుమారు 50 మంది రైల్వే ఆఫీసర్లు పాల్గొని బ్లాక్ పనులు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 22వ తేదీన చేపట్టిన రైల్వే మెగా బ్లాక్‌ను అక్టోబర్ 7వ తేదీ వరకు కొనసాగించనున్నట్లు వారు తెలిపారు.

ఐలమ్మ సంకల్పం యువతకు ప్రేరణ

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: చాకలి ఐలమ్మ ధైర్యం, త్యాగం, సంకల్పం ఈ తరం యువతకు ప్రేరణగా నిలుస్తాయని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ వరుణ్ రెడ్డి, ఇన్‌చార్జ్ డైరెక్టర్లు, అధికారులు.. ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఎండీ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ ప్రస్థానం శక్తివంతమైన అధ్యాయమని తెలిపారు. భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు వి.తిరుపతి రెడ్డి, మధుసూదన్, సీజీఎంలు కె.తిరుమల్ రావు, కె.కిషన్, రవీంద్రనాథ్, కె.ఎస్. గుట్ట, జాయింట్ సెక్రటరీ రమేశ్, డి.ఈలు కె.అనిల్ కుమార్, శ్రీధరాచారి, ఏ.ఎస్ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

బాలికల ఓవరాల్ చాంపియన్ వరంగల్

- బాలుర విభాగంలో కరీంనగర్
- ఉత్తమ క్రీడాకారులుగా కిరణ్, యశ్వంతిక
- ముగిసిన రాష్ట్ర స్థాయి 68వ ఎస్‌జీఎఫ్ జూడో పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ పోచమ్మమైదాన్‌లోని కెమిస్ట్ భవన్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన 68వ పాఠశాల క్రీడల సమాఖ్య రాష్ట్ర స్థాయి అండర్–14 బాలబాలికల జూడో పోటీలు గురువారం ముగిశాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో బాలికల విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా వరంగల్ నిలవగా రన్నరప్‌గా కరీంనగర్ బాలికలు నిలిచారు. బాలుర విభాగంలో కరీంనగర్ చాంపియన్‌గా ట్రోఫీని దక్కించుకోగా, వరంగల్ క్రీడాకారులు రెండో స్థానంలో నిలిచారు. 25 కేజీల బరువులోపు విభాగంలో నల్లగొండ జిల్లాకు చెందిన కె. కిరణ్‌కుమార్ ఉత్తమ క్రీడాకారుడిగా పతకం అందుకున్నాడు. బాలికల విభాగంలో 40 కేజీల బరువులోపు కేటగిరీలో ప్రతిభ కనబరిచిన కరీంనగర్‌కు చెందిన బి. యశ్వంతిక ఉత్తమ క్రీడాకారిణిగా నిలిచింది.

200 మంది క్రీడాకారులు హాజరు..

23, 27, 32, 36, 40, 44 కేజీల బరువు లోపు కేటగిరీతో పాటు 44 కేజీల పైన బరువు కేటగిరీల్లో నిర్వహించిన పోటీలకు ఉమ్మడి పది జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దస్రూనాయక్ తెలిపారు. ఏడు కేటగిరీల్లో జరిగిన పోటీల్లో బంగారు పతకం సాధించిన ఏడుగురు బాలికలు, ఏడుగురు బాలురను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు వివరించారు. వచ్చే నెల (అక్టోబర్) 3 నుంచి 6వ తేదీ వరకు గుజరాత్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. కాగా, నవంబర్ రెండో వారంలో కజకిస్తాన్‌లో జరిగే ఏషియన్ కప్ చాంపియన్‌షిప్‌కు షేక్‌పేటకు చెందిన సీనియర్ క్రీడాకారుడు పి. రంగా భారత జట్టుకు ఎంపికైనట్లు కోచ్ రాము తెలిపారు. కార్యక్రమంలో జూడో ఫెడరేషన్ బాధ్యులు కైలాస్‌యాదవ్, సంతోశ్, రాజు, కిషన్ పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ, జూడో సంఘం బాధ్యులు, పీడీ, పీఈటీలు

క్షేత్రస్థాయి నుంచి ఉద్యమం ఉధృతం

- త్వరలో వరంగల్ వేదికగా బీసీల భారీ బహిరంగ సభ
- బీసీ రాజ్యాధికార సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేశ్

హన్మకొండ: క్షేత్రస్థాయి నుంచి బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేశ్ అన్నారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బీసీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో, అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో దాసు సురేశ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ తరహాలో బీసీ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. బీసీ రాజ్యాధికారం లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తామన్నారు. హక్కుల సాధనకు బీసీలు వెనుకడుగు వేసేది లేదన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా బీసీల హక్కులను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచినప్పటికీ ఆ డిక్లరేషన్‌ను అమలు చేయకపోవడంతో బీసీలు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. బీసీ జనగణన చేపట్టాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలు బీసీలకు రాజ్యాధికారాన్ని చేరువ చేస్తున్నాయని, బీసీలు సంఘటితంగా ఉంటే కచ్చితంగా రాజ్యాధికారాన్ని సాధించగలరని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆర్.కృష్ణయ్య రాజీనామాను స్వాగతిస్తున్నామన్నారు. ఆయా పార్టీల్లో ఉన్న బీసీ ప్రజాప్రతినిధులు ఆయన బాటలో నడవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడానికి కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. త్వరలో వరంగల్‌లో బీసీల భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. బీసీల హక్కుల కోసం పోస్టుకార్డు ఉద్యమాలు, నిరాహార దీక్షలు, ర్యాలీలు, మహాధర్నాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. తెలంగాణ ఉద్యమానికి కేంద్రబిందువైన వరంగల్ నుంచే ఈ ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు, గ్రామాల్లో కుల, విద్యార్థి, ఉద్యమ సంఘాలను సమీకరిస్తూ బీసీ ఉద్యమాన్ని తీవ్రం చేస్తామన్నారు. బీసీలంతా ఉద్యమంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు దారం జనార్దన్, తిరుహని శేషు, సాయిని నరేందర్, ఏకాంబరం, చిరంజీవి, బీసీ కత్తుల కవిత, ఇమ్మడి ప్రసన్న, అన్న రాజు, వడ్లాల నరేందర్, ధారబోయిన సతీశ్, శృంగారపు భాస్కరాచారి, వంగ మహేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేశ్

ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలి

- కేయూ ప్రొఫెసర్ వెంకయ్య

కేయూ క్యాంపస్: శాస్త్రీయ దృక్పథంతో ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలని కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం ప్రొఫెసర్ వై. వెంకయ్య అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభలో ఆయన మాట్లాడారు. నేటి విద్యార్థి, యువతలో ప్రగతిశీల భావాలు లోపించడం వల్ల విదేశీ సంస్కృతికి బానిసై జీవితాలు నాశనం చేసుకుంటున్న పరిస్థితి ఉందన్నారు. కాగా, పీడీఎస్‌యూ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నాయకులు, కార్యకర్తలు క్యాంపస్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కంపాటి పృథ్వీ, బాధ్యులు కొత్తపల్లి రవి, ముల్క రవి, బి. నర్సింహారావు, వినయ్, వంశీ, హర్ష, రవి, రాజు, అజహర్, కేయూ నాయకులు అశోక్, నరేశ్, పృథ్వీరాజ్, అనూష, సంగీత, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేయూ జువాలజీ విభాగం ప్రొఫెసర్ వెంకయ్య

ఇప్పట్లో ఉప ఎన్నికలు రావు.. వచ్చినా సిద్ధంగా ఉన్నాం

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్‌ఘన్‌పూర్ : పార్టీ ఫిరాయింపు విషయంలో కోర్టులపై, ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకం, గౌరవం ఉన్నాయని, ఇప్పట్లో ఉప ఎన్నికలు రావని, ఒకవేళ వచ్చినా మేము సిద్ధంగా ఉన్నామని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందన్నారు. మూడు దశాబ్దాల రాజకీయ చరిత్ర తనదని, తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని, ఒకవేళ ఎన్నికలు వస్తే బీఆర్ఎస్ వారికి డిపాజిట్లు సైతం దక్కవన్నారు. బీఆర్ఎస్ హయాంలో 38 మంది ఎమ్మెల్యేలను ఆ పార్టీలో చేర్చుకున్నారని, ఏకంగా రాజకీయ పార్టీల శాసనసభాపక్షాలను కలుపుకున్న నీచ చరిత్ర బీఆర్ఎస్‌దే అన్నారు. ప్రస్తుతం సిగ్గు లేకుండా పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. వరంగల్ చరిత్రను, గొప్పదనాన్ని చెడగొట్టేలా కేసీఆర్.. ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేశారని మండిపడ్డారు. ఉమ్మడి వరంగల్ జిల్లా విభజన వద్దన్నందుకే తనకు రెండో సారి మంత్రి పదవి దక్కలేదన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ నిరంకుశ పాలన సాగించారని, తెలంగాణ రాష్ట్రం పదేళ్లు కేసీఆర్ కుటుంబం చేతిలో బందీ అయిందన్నారు. కేసీఆర్‌కు, ఆయన కుటుంబ సభ్యులకు హైదరాబాద్‌లో వందల కోట్ల రూపాయల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు.

కుల పెద్దల మాట వినడం లేదని కుల బహిష్కరణ

- జనగామ జిల్లా పాలకుర్తి మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన..
- పోలీస్ స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు

పాలకుర్తి టౌన్: కుల పెద్దల మాట వినడం లేదని ఓ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేశారు. ఈ ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరులో ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ పోస్టుమాస్టర్ జ్యోతి సోమయ్య తల్లి పది రోజుల క్రితం మృతి చెందింది. దహన సంస్కారాల అనంతరం తల్లి దశదినకర్మకు ఎవరూ వెళ్లకూడదని కుల పెద్దలు హుకుం జారీ చేశారు. వెళ్లిన వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించడంతో ఆ కుటుంబం వైపు ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు కన్నెత్తి చూడలేదు.

అసలు పంచాయితీ ఇదీ..

సోమయ్యకు తన తోడబుట్టిన వ్యక్తులతోపాటు పాలివారితో కొద్ది సంవత్సరాలుగా భూమి పంచాయితీ నడుస్తోంది. ఈ విషయం కులపెద్దల మాట వినడం లేదని ఈ నెల 22వ తేదీన సోమయ్య కుటుంబాన్ని బహిష్కరించారు. ఆ కుటుంబం వైపు కన్నెత్తి చూడకూడదని, మాట్లాడకూడదని కుల పెద్దలు ఆదేశించారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన సోమయ్య ఈ నెల 23వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై పాలకుర్తి ఎస్సై సాయి ప్రసన్నకుమార్‌ను వివరణ కోరగా గూడూరు గ్రామానికి చెందిన జ్యోతి సోమయ్య కుల బహిష్కరణ చేశారని బాధితుడి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా, తాను పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని బాధితుడు సోమయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

డిగ్రీ సెమిస్టర్ల పరీక్ష ఫీజు చెల్లించాలి

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు బీఏ, బీకాం, బీబీఎం, బీఎస్సీ తదితర కోర్సుల రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సబ్జెక్టులకు సంబంధించి మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ల పరీక్ష ఫీజును అక్టోబర్ 5వ తేదీ వరకు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి గురువారం తెలిపారు. రూ. 50 అపరాధ రుసుంతో అక్టోబర్ 15 వరకు పరీక్ష ఫీజు చెల్లించుకోవచ్చునని తెలిపారు. పూర్తి వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ .ఏసి.ఇన్, లేదా డబ్ల్యూడబ్ల్యూ .కేయూ ఆన్‌లైన్‌లో చూడొచ్చని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో స్వర్ణకారుడి ఆత్మహత్య

- పరకాల పట్టణంలో ఘటన



రామాచారి(ఫైల్)

పరకాల : ఆర్థిక ఇబ్బందులతో ఓ స్వర్ణకారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పరకాలలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని మార్కెట్ రోడ్డులో అన్నపూర్ణ జువెల్లర్స్ షాపు నడుపుతున్న కాడర్ల రామాచారి(48) వ్యాపారం సరిగా నడవకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాడు. కొంతకాలంగా మానసిక వేదనకు లోనవుతున్నాడు. బుధవారం రాత్రి 10 గంటల వరకు ఇంటికి వెళ్లకపోవడంతో అతడి భార్య దుకాణానికి వచ్చి ఇంటికి రావాలని కోరింది. కొంత సమయం నిద్రించి వస్తానని చెప్పిన రామాచారి.. 11గంటల వరకు కూడా వెళ్లలేదు. దీంతో అనుమానం కలిగి వెళ్లి చూడగా దుకాణంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో భార్య బోరున విలపించగా స్థానికులు షాపునకు చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే రామాచారి మృతి చెందినట్లు పోలీసులు గుర్తించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరకాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిద్దరూ కూడా ఇదే వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మృతుడి భార్య అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పరకాల సీఐ క్రాంతికుమార్ తెలిపారు.